ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలు

పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జూ

ఉట్నూర్, ఫిబ్రవరి 3 : ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలు తయారయ్యాయని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జూ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ పోస్టర్ అధ్యాపకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ విద్యా సంస్థలను బలోపేతం చేస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉచితంగా, నిపుణులతో బోధించే విద్యాసంస్థల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వామి, అధ్యాపకులు సంగీత, శ్రావణి, రవీందర్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, ప్రవీణ్, జావిద్, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి

మాట్లాడుతున్న బోథ్ జూనియర్ సివిల్ జడ్జి బీ హుస్సేన్

ఇచ్చోడ, ఫిబ్రవరి 3 : ప్రజలు తమ పిల్లలకు చిన్నప్పటి నుంచే చట్టాలపై అవగాహన కల్పించాలని బోథ్ జూనియర్ సివిల్ జడ్జి బీ హుస్సేన్ సూచించారు. శనివారం బాబ్జిపేట్ గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. పిల్లలను తప్పకుండా బడికి పంపాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. మోటర్ వెహికిల్ చట్టం, బాల్య వివాహాలు, వరకట్నం, బాల కార్మిక నిర్మూలన విద్యాహక్కు చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ టెక్కం దేవ్‌రావ్, బార్ అసోసియేషన్ సెక్రటరీ పంద్రం శంకర్, కుమ్మరి విజయ్‌కుమార్, గ్రామ పెద్దలు ఆనందరావ్, చందర్, భీంరావ్, బాపురావ్, గుండాల రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్

బోథ్, ఫిబ్రవరి 3 : మార్చి 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బోథ్ జూనియర్ సివిల్ జడ్జి బి హుస్సేన్ తెలిపారు. శనివారం బోథ్ కోర్టు ప్రాంగణంలో పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. లోక్ అదాలత్‌లో సాధ్యమైనంత వరకు ఎక్కువ కేసులు పరిష్కరమయ్యే విధంగా చొరవ చూపాలని సూచించారు. సమావేశంలో పీపీ శ్రీధర్, బోథ్ సీఐ భీమేశ్, ఎస్ఐ రాము, ఇచ్చోడ, నేరడిగొండ, బజార్ హత్నూర్, గుడిహత్నూర్, సిరికొండ మండలాల ఎస్ఐలు, కోర్టు పీసీలు, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళా

ఎదులాపురం, ఫిబ్రవరి 3 : జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 7వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కే మిల్కా ఒక ప్రకటనలో తెలిపారు. స్పందన స్ఫూర్తిలో లోన్ ఆఫీసర్ నియామకానికి పదో తరగతి, ఇంటర్, ఫైనాన్షియల్ లిమిటెడ్‌లో బ్రాంచ్ మేనేజర్‌కు డిగ్రీ ఆపై చదువుకున్న పురుషులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి రూ.14వేల నుంచి రూ.20వేల వరకు జీతం ఉంటుందని తెలిపారు. ఎంపికైనవారు ఆదిలాబాద్ లో పని చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థుల వయసు 20 నుంచి 27 సంవత్సరాల వరకు ఉండాలన్నారు. అన్ని విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు ఆధార్, పాన్ జిరాక్స్ కాపీలతో బుధవారం ఉదయం10.30 గంటలకు జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నంబర్లు 7659978443, 9866366320 ను సంప్రదించాలని సూచించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-319429-All

తెలుగులో ఉచిత ఖుర్‌ఆన్ కొరకు
ఫోన్ చేయండి
1800 572 3000
సమస్యలన్నిటికీ పరిష్కారం దైవసందేశం ద్వారానే సాధ్యం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు

• మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

ఫిల్టర్ బెడ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 3 : రానున్న వేసవి కాలం నేపథ్యంలో పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో మున్సిపల్ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తాగునీటి సమస్యలపై ఆరా తీశారు. అధికారులతో కలిసి ఫిల్టర్ బెడ్, లాండ్‌సాంగ్వి కేంద్రాలను సందర్శించారు. అధికారులతో కలిసి మిషన్ భగీరథ నీటి సరఫరా విధానంలో ఉన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వేసవికాలం నేపథ్యంలో ఆదిలాబాద్ పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి ముందస్తు చర్యలపై దిశా నిర్దేశం చేశారు. మాజీమంత్రి జోగు రామన్న ముందు చొరవతో రూ.కోట్లను సమకూర్చుకొని పలు ఏరియాలకు ప్రత్యేకంగా మిషన్ భగీరథ పైప్‌లైన్లను ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా పూర్తి చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఇంటింటికీ నల్లలను సైతం ఏర్పాటు చేసిన ఘతన కేసీఆర్ ప్రభుత్వానిదే అన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ అధికారులు తిరుపతి పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

బోథ్, ఫిబ్రవరి 3 : వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్ఐ రాము సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని శనివారం నాగభూషణం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తీసిన ర్యాలీని ప్రారంభించారు. అనంతరం బస్టాండ్ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో సీట్ బెల్టు ధరించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలను నడుపొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కిశోర్‌కుమార్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బోథ్‌లో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్ఐ రాము

నాగోబాకు గిరిజనుల పూజలు

నాగ్‌డో ఆలయానికి వెళ్తున్న గిరిజనులు

బోథ్, ఫిబ్రవరి 3 : మందబొగూడ ఆదివాసీ గిరిజనులు శనివారం మహారాష్ట్రలోని నాగ్‌డో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులంతా గ్రామంలో జంగుబాయి విగ్రహాన్ని మొదట ఊరేగించారు. డోలు వాయిస్తూ శోభాయాత్ర చేపట్టారు. అనంతరం వాహనాల్లో నాగ్‌డో ఆలయానికి తరలి వెళ్లారు. అక్కడ నాగోబా, శివాలయాల్లో పూజలు చేశారు. జంగుబాయి ఉత్సవమూర్తి విగ్రహానికి గంగస్నానం చేయించారు. కార్యక్రమంలో గ్రామపటేల్, దేవరి, పూజారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో జిల్లా పేరును నిలబెట్టాలి

బహుమతులు అందజేస్తున్న జిల్లా విద్యాధికారి ప్రణీత

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 3 : రాష్ట్ర స్థాయిలో జిల్లా పేరును నిలబెట్టాలని జిల్లా విద్యాధికారి ప్రణీత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీల్లో విజేతగా నిలిచి రాష్ట్రానికి ఎంపికైన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. తెలుగు మీడియం విభాగం నుంచి తాంసి(బీ) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జీ పల్లవి, ఆర్ బిందుజా, ఐ శివ ప్రియ, ఇంగ్లిష్ మీడియం విభాగం నుంచి మోడల్ స్కూల్ బంగారుగూడ విద్యార్థులు వీ శివశంకర్, బీ హర్షవర్ధన్, కే హర్షిక, ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం నుంచి చావరా అకాడమీ కత్తులాపూర్ మహతి, డీ న్యాసారెడ్డి, కే హర్షవర్ధన్ ఈ నెల 9, 10, 11వ తేదీల్లో జనగామ పట్టణంలో నిర్వహించే రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబురాలకు ఎంపికైనట్లు జిల్లా అధ్యక్షుడు సంతోష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి జీ నారాయణ, డిస్ట్రిక్ సైన్స్ అధికారి రఘు రమణ, ట్రస్మా ప్రధాన కార్యదర్శి దేవేందర్ పటాస్కర్, ఫిజికల్ ఫోరం నాయకుడు చంద్రశేఖర్, జన విజ్ఞాన వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంతోష్, రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు దీప్తి, శ్రీధర్‌బాబు, వీరన్న, శ్రీనివాస్, గంగన్న, లింగారెడ్డి, సుభాష్, గంగయ్య, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటి పాల్గొన్నారు.

హామీలు నేరవేర్చడంలో సీఎం విఫలం

మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సాజిద్‌ఉద్దీన్

ఎదులాపురం, ఫిబ్రవరి 3 : ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సాజిద్ ఉద్దీన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అమలు చేస్తామన్న రేవంత్ రెడ్డి ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని మాట మారుస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో అధికారంలోకి వచ్చే ప్రసక్తి లేదన్నారు. దేశంలో పేదరికం పెరగడానికి కాంగ్రెస్ పార్టీ ప్రధాన కారణమన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ ఇజ్జగిరి అశోక్, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఎదులాపురం, ఫిబ్రవరి 3 : బీసీ స్టడీ సర్కిల్‌లో నాలుగు నెలల పాటు ఉచితంగా ఇస్తున్న శిక్షణను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహాతో అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-1,2,3,4 ఫౌండేషన్ ఉచిత శిక్షణ తరగతుల ప్రారంభించడానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ప్రణాళిక పట్టుదల క్రమశిక్షణతో సిలబస్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎలాంటి సందేహాలు ఉంటే వెంటనే అధ్యాపకులను అడిగి తెలుసుకోవాలన్నారు. కష్టపడితే ఎదైన సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో డీబీసీడీవో రాజలింగు, స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ఆర్ఐను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బోథ్, ఫిబ్రవరి 3: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ రాహుల్ రాజ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న బోథ్ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న సునీతను శనివారం బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు అందుకోవాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన క్రీడాకారులకు ఘన స్వాగతం

క్రీడాకారులను సన్మానిస్తున్న వివిధ అసోసియేషన్ సభ్యులు

ఎదులాపురం, ఫిబ్రవరి 3 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చీరాలలో జనవరి 31 నుంచి ఈ నెల1వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు శనివారం జిల్లాకు చేరుకున్నారు. రైల్వే స్టేషన్‌లో తెలంగాణ షూటింగ్ బాల్ సంఘం ఆధ్వర్యంలో క్రీడాకారులకు బ్యాండ్‌మేళాలు వాయిస్తూ ఘన స్వాగతం పలికారు. అనంతరం తెలంగాణ షూటింగ్ బాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని రవికుమార్, ఉపాధ్యక్షుడు డాక్టర్ క్రాంతి కుమార్, ఒలింపిక్ సంఘం జిల్లా కోశాధికారి పార్థసారథి, టెబుల్ టెన్నిస్ సంఘం జిల్లా అధ్యక్షుడు రాష్ట్రపాల్, ప్రధాన కార్యదర్శి పిల్లి కిషన్ క్రీడాకారులకు పూలమాల వేసి ఘనంగా సత్కారించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వివేక్, మజార్, గణేశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

క్యాంపస్ టూ కార్పొరేట్‌పై శిక్షణ

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 3 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాలలో శనివారం క్యాంపస్ టూ కార్పొరేట్ అంశంపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని ప్రిన్సిపాల్ జలగం అనిత తెలిపారు. టాస్క్ ద్వారా కోకా కోల కంపెనీ నుంచి ట్రైనర్ అబ్దుల్ శిక్షణను అందించారు. కార్పొరేట్‌లో ఎలా వ్యవహరించాలో, ఇంటర్వ్యూకి ఎలా వెళ్లాలో పలు విషయాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ కోటయ్య, టీఎస్‌కేసీ మెంటర్ చైతన్య కృష్ణ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

జైనథ్, ఫిబ్రవరి 3 : మండల కేంద్రానికి చెందిన గొల్ల పవన్ బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న జైనథ్, తలమడుగు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర సిబ్బంది ఇతర స్వచ్ఛంద సంస్థ వ్యక్తులతో కలిసి తమ వంతు సహాయంగా శనివారం రూ.13,500 నగదును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. తలమడుగు బ్రాంచ్ స్పెషల్ అసిస్టెంట్ కాడె స్వామి మాట్లాడుతూ వైద్య ఖర్చులు రూ.7లక్షలు అవుతుందని వైద్యులు తెలిపారని అన్నారు. పేద కుటుంబానికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకువచ్చి ఆదుకోవాలని కోరారు. విరాళం అందించిన వారిలో క్యాషియర్ శ్రీనివాస్, జైనథ్ బ్యాంక్ స్పెషల్ అసిస్టెంట్ సూర్య, సబ్ స్టాఫ్ బాబులాల్, లక్ష్మిపూర్ మాజీ సర్పంచ్ రాజేశ్వర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన ఉండాలి

ఉట్నూర్ రూరల్, ఫిబ్రవరి 3 : ఆర్థిక లావాదేవీలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని నాబార్డు అధికారి రాంరెడ్డి అన్నారు. శనివారం కొలాంగూడ గ్రామంలో నాబార్డు సౌజన్యంతో సహకార బ్యాంకు ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి కొత్త రుణాలు తీసుకోవాలని సూచించారు. సహకార బ్యాంకు ఖాతాదారులకు అందిస్తున్న ప్రధానమంత్రి జీవన జ్యోతి, సురక్ష బీమా యోజన పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ కిరణ్ కుమార్, గ్రామపటేల్ కేకం చిన్ను, టేకం రాజు, రైతులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్షలపై అవగాహన

బోథ్, ఫిబ్రవరి 3: కౌత(బీ) గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో కన్గట్ట, పొచ్చెర, కౌత(బీ) ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం ప్రముఖ పోటీ పరీక్షల నిపుణులు అల్లం సాయికృష్ణ, రమణ గౌడ్ గొడిసెల పరీక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌత(బీ) పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శశిధర్ రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు గంగాధర్, వివేకానంద, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

తాంసి, ఫిబ్రవరి 3 : పొన్నారి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం జిల్లా ఇన్యూనైజేషన్ అధికారి డాక్టర్ వైసీ శ్రీనివాస్ తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. గర్భిణులు, పిల్లలకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల హాజరుశాతాన్ని పెంచాలని, పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. వారి వెంట అంగన్‌వాడీ టీచర్లు దేవమ్మ, గంగమ్మ, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇచ్చోడ, ఫిబ్రవరి 3 : ఇచ్చోడ, నర్సాపూర్, సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఆదివారం చెట్లను తొలగించడం వల్ల ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాజు, ఏడీ సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఇచ్చోడ, ఫిబ్రవరి 3: మండల కేంద్రంలోని హైవేపై ఆగి ఉన్న వాహనాన్ని ఢీ కొని ఒకరు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేరళ రాష్ట్రానికి తొట్టెసెర్రెహౌస్ గ్రామానికి చెందిన షమీర్, అబ్దుల్ కరీం మహారాష్ట్రలోని అమరావతి నుంచి మినీ లారీలో సంత్ర పండ్ల లోడ్‌తో కేరళ వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యంలో ఆదిలాబాద్ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం శుక్రవారం ఉదయం మినీ లారీని ఢీ కొనడంతో షమీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. శనివారం చికిత్స పొందుతూ రిమ్స్‌లో మృతి చెందాడు. అబ్దుల్ కరీంకు స్వల్ప గాయాలయ్యాయి. షమీర్ తమ్ముడు సమద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గుర్తు తెలియని వాహనాన్ని గుర్తించేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

విజయవంతం చేయాలి

ఇచ్చోడ, ఫిబ్రవరి 3: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16వ తేదీన గ్రామీణ బంద్ సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దేవేందర్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతులకు ఉపయోగపడే విధంగా మార్చలన్నారు. విద్యుత్ బిల్లు 2022ను ఉపసంహరించుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు, ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కుంటాల రాములు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షురాలు చంద్రకళ, జిల్లా సహాయ కార్యదర్శి గంగయ్య, నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు సేవ చేయాలి

ఉట్నూర్, ఫిబ్రవరి 3: ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సేవ చేయాలని పర్ధాన్ సంఘం మండలాధ్యక్షుడు మెస్రం కేశవ్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వికాసం పాఠశాలలో వినికిడి లోపం విద్యార్థులకు హియర్ నౌ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినికిడి లోపం పిల్లలకు రూ.70వేలు ఖర్చు చేసి మిషన్లు ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వికాస్, ఉపాధ్యాయులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్ మహమ్మారిపై అవగాహన

తాంసి(తలమడుగు), ఫిబ్రవరి 3 : ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా తలమడుగు మండలం కజ్జర్ల గ్రామంలో డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ ప్రారంభించారు. వైద్యులు, గ్రామస్తులకు పరీక్షలు చేసి ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో న్యాయమూర్తి డాక్టర్ శివరాం ప్రసాద్, డీఎల్ఎల్ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే ఎంపీడీవో రమాకాంత్, గైనకాలజీ సర్జన్ ఫిజిషియన్ పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు పేర్లు నమోదు చేసుకోవాలి

ఎదులాపురం, ఫిబ్రవరి 3 : ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అంజని పుత్రరియల్ ఎస్టేట్స్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. ఆసక్తి గల వారు 7893821012, 7386957616 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గ్రామీణ యువకులు క్రీడల్లో రాణించాలి

నేరడిగొండ : వడూర్‌లో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, ఫిబ్రవరి 3 : గ్రామీణ ప్రాంత యువకులు క్రీడల్లో రాణించాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. శనివారం వడూర్ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చదువుపై శ్రద్ధ కనబరిచి ఉన్నత స్థాయిలో రాణించాలని సూచించారు. అలాగే గ్రామంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, ఎంపీటీసీ పండరి, నాయకులు సయ్యద్ జహీర్, శ్రీనివాస్‌రెడ్డి, గాదె శంకర్, గాదె రవీందర్, అనిల్ యాదవ్, ఫయాజ్, సురేందర్, ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయులు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

గుడిహత్నూర్, ఫిబ్రవరి 3 : మండలంలోని శాంతాపూర్ గ్రామానికి చెందిన అవినాశ్ సాబ్లే, కొల్హారి గ్రామానికి చెందిన సేవలే విజయ్ ఆయన భార్య పల్లవి ఇటీవల ఆత్మహత్య చేసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులను శనివారం బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పరామర్శించారు. అనారోగ్యంతో బాధ పడుతున్న తులసీదాస్‌ను, గుడిహత్నూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు రావణ్ ముండె ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మండల కేంద్రంలో రఘునాథ్ ముండె, షేక్ మహ్మద్ ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు ఉన్నారు.

నేరడిగొండ, ఫిబ్రవరి 3 : బుద్దికొండ గ్రామానికి చెందిన గొల్ల నారాయణ కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పరామర్శించారు. ఆయన వెంట నేరడిగొండ, ఇచ్చోడ ఎంపీపీ రాథోడ్ సజన్, ప్రీతమ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గంగామణి, నాయకులు అనిల్ యాదవ్, సురేందర్ ఉన్నారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

సిడాం వినేశ్(ఫైల్)

ఇంద్రవెల్లి, జనవరి 3 : మండలంలోని తుమ్మగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని పాలోండిగూడ శివారులోని ఓ రైతుకు చెందిన వ్యవసాయ భూమిలో అనుమానాస్పదంగా యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉట్నూర్ మండలం చింతకర గ్